సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శనివారం, 16, సెప్టెంబర్, 2023



సోమశిలలో నీటి నిల్వ

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో శుక్రవారం సాయంత్రానికి 22.625 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయానికి 1,554 క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు) -	రూ.60,760
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా) -	రూ.5,474
3 శాతం జీఎస్టీతో.. -	రూ.5,638
సవర (8 గ్రా) -	రూ.45,104

వాతావరణం

గరిష్టం/కనిష్టం 37.1 /28.3

శుక్రవారం గాలిలో తేమ 76 శాతం ఉంది. శనివారం జిల్లాలో పలుచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

కొత్త పింఛన్ల సంబరం

జిల్లావ్యాప్తంగా 16,212 మందికి కొత్తగా మంజూరు

- అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందేలా ప్రభుత్వం చర్యలు
- ప్రభుత్వం తీరును అభినందిస్తున్న పింఛన్‌దారులు

రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పాలన ద్వారా ప్రజలకు అండగా నిలుస్తోంది. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నారు. అందులో భాగంగా పింఛన్‌దారులకు ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి 5వ తేదీ వరకు పింఛన్ నగదును వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకే వెళ్లి అందించేలా చర్యలు తీసుకుంది. అంతేకాకుండా అర్హత ఉన్న వారికి కొత్తగా పింఛన్లు మంజూరు చేస్తూ భరోసానిస్తోంది. ఈ నెలలో కొత్తగా పింఛన్లు అందుకున్న లబ్ధిదారులు తమకు వినాయక చవితి పండగ ముందే వచ్చిందంటూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



పాదలకూరులో కొత్తగా మంజూరైన పింఛన్‌ను లబ్ధిదారుకు ఇంటికి వెళ్లి అందజేస్తున్న రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి (ఫైల్)

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: రాష్ట్ర ప్రభుత్వం పింఛన్ల మంజూరు విషయంలో మానవతా దృక్పథంతో వ్యవహరిస్తోంది. అర్హులందరికీ పెన్షన్లు అందించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులతోపాటు ఇతర పింఛన్‌దారులకు ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఏడాది పెన్షన్ సొమ్మును ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెంచుతూ పోతున్నారు. జిల్లాలో ఈ నెలలో నూతనంగా 16,212 మందికి పెన్షన్లు వినాయక చవితి కానుకగా మంజూరు చేసి లబ్ధిదారులకు నగదు అందించారు. చవితి పండగకు ముందే పెన్షన్ వచ్చిందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

3,18,664 మందికి పెన్షన్లు

జిల్లావ్యాప్తంగా వృద్ధులు, వితంతువులు, చేనేత కార్మికులు, దివ్యాంగులు, అభయహస్తం, డప్పు కళాకారులు, కళాకారులు, మత్స్యకారులు, కిడ్నీ పేషెంట్లు, ట్రాన్స్‌జెండర్స్, సైనిక్ హెల్ఫేర్ పింఛన్లు కలిపి 3,18,664 మందికి నెల వారీగా రూ.88.57 కోట్ల పెన్షన్ నగదును రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. ప్రతి నెలా ఒకటో తేదీన ఉదయాన్నే వలంటీర్లు లబ్ధిదారుల ఇంటి ముంగిటకు వెళ్లి పింఛన్ నగదును అందజేస్తూ వారికి అండగా నిలుస్తున్నారు. అనారోగ్య సమస్యలతో ఆస్పత్రుల్లో చికిత్సపొందుతున్న వారికి కూడా వలంటీర్లు మానవతా దృక్పథంతో ఆయా ఆస్పత్రులకు వెళ్లి పింఛన్ అందజేస్తున్నారు.

కొత్త పెన్షన్‌దారులకు చవితి పండగ

జిల్లావ్యాప్తంగా ఈ నెలలో 16,212 కొత్త పెన్షన్లు మంజూరు కాగా రూ.4.54 కోట్ల పింఛన్ నగదును ప్రభుత్వం లబ్ధిదారులకు అందించింది. తద్వారా కొత్త పెన్షన్‌దారులకు వినాయక చవితి పండగ ముందే వచ్చినట్లయింది. పింఛన్ నగదు అందుకున్న అవ్వాతాతలు, దివ్యాంగులు, వితంతువులు, ఇతర పింఛన్‌దారులు మురిసిపోతున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమ కుటుంబసభ్యుడిగా తమకు పింఛన్ కానుకను అందజేశారని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మూడు విడతలుగా పెన్షన్లు మంజూరు చేసి పండగ కానుకగా లబ్ధిదారులకు అందించారు. సాధారణంగా 5వ తేదీ నాటికి పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉంది. ఈసారి రెండో విడతలో కూడా పింఛన్లు మంజూరు కావడంతో సెప్టెంబర్ 15వ తేదీ వరకు సమయం ఇచ్చి అందరికీ పింఛన్ నగదు అందేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. కొత్త పెన్షన్ల ద్వారా ప్రభుత్వంపై అదనపు భారం పడుతున్నా అర్హులందరికీ పింఛన్లు అందించాలన్న సంకల్పంతో ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

జిల్లాలో..

జనాభా -	29,14,112 మంది
పింఛన్ లబ్ధిదారులు -	3,18,664
జనాభాలో పెన్షన్ పంపిణీ శాతం	10.63

పెన్షన్ రకం	మొత్తం పెన్షన్లు	అందిస్తున్న నగదు (రూ.కోట్లలో.)
వృద్ధాప్య	1,75,690	48,29,15,000
వితంతు	72,867	20,02,70,000
దివ్యాంగుల	33,171	9,95,13,000
చేనేత	3,336	91,74,000
కల్లుగీత	2,664	73,26,000
అభయహస్తం	4,835	24,17,500
మత్స్యకార	5,078	1,39,64,500
ఒంటరి మహిళ	11,170	3,07,17,500
హిజ్రాలు	120	3,60,000
కిడ్నీ వ్యాధిగ్రస్తులు	953	95,30,000
డప్పు కళాకారులు	3,556	1,06,68,000
చర్మకారులు	2,739	75,32,250
డీఎంహెచ్ఓ	2,128	1,02,94,000
కళాకారులు	346	10,38,000
సైనిక్ సంక్షేమ	11	55,000
మొత్తం	3,18,664	రూ.88,57,74,750

సంతోషంగా ఉంది



వినాయక చవితి పండగకు ముందే నాబిడ్డలాంటి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మా ఇంటికి పింఛన్ డబ్బులు పంపించారు. ఈ వయసులో ఈ పింఛన్ డబ్బు నాకెంతో ఆదరవుగా ఉంటుంది. ఇక ప్రతి నెలా ఎవరి సాయం అవసరం లేకుండానే పింఛన్ డబ్బులు ఖర్చు పెట్టుకోవచ్చు. ఈ రోజు నాకు సంతోషంగా ఉంది.

– మైలపూరు లలితమ్మ, పింఛన్‌దారు, పొదలకూరు

జగనన్నకు రుణపడి ఉంటాం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అర్హత ఉంటే చాలు పెన్షన్ వచ్చేస్తుంది. గత ప్రభుత్వంలో కాళ్లరిగేలా తిరిగినా పెన్షన్ వచ్చేది కాదు. ఈ ప్రభుత్వంలో పేదలకు న్యాయం జరుగుతోంది. వినాయక చవితి పండగకు ముందే పింఛన్ నగదు చేతికివ్వడం ఎంతో ఆనందంగా ఉంది.

– మారెళ్ల మధు, పొదలకూరు

అర్హులందరికీ పింఛన్లు



రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో ప్రతి నెలా 1వ తేదీ నుంచి వలంటీర్ల ద్వారా లబ్ధిదారులకు పెన్షన్ సొమ్ము పంపిణీ చేస్తోంది. ఈ నెలలో రెండు విడతల్లో అర్హులకు పింఛన్ల మంజూరు ఉత్తర్వులు వచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పింఛన్‌దారులకు అర్హత ఆధారంగా పెన్షన్ నగదు అందేలా చర్యలు తీసుకుంటున్నాం.

– సాంబశివారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ

న్యూస్‌రీల్

60 పీజీ సీట్లకు అనుమతివ్వండి

- వైద్యశాఖకు నివేదిక పంపిన అధికారులు

నెల్లూరు(సెంట్రల్): నెల్లూరులోని ప్రభుత్వ మెడికల్ కళాశాలకు సంబంధించి వివిధ విభాగాల్లో 60 పీజీ సీట్లు కేటాయించాలని మెడికల్ కళాశాల అధికారులు వైద్యశాఖ ఉన్నతాధికారులను కోరారు. శుక్రవారం వైద్యశాఖ ఉన్నతాధికారులకు ఆన్‌లైన్‌లో పూర్తి వివరాలను పంపారు. ఈ సందర్భంగా వైద్యశాల సూపరింటెండెంట్ నరేంద్ర మాట్లాడుతూ ప్రధానంగా జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, గైనిక్, ఈఎన్‌టీ, ఆర్థోపెడిక్ విభాగాలకు పీజీ సీట్లు కావాలని తెలిపినట్లు వివరించారు. త్వరలో నేషనల్ మెడికల్ కౌన్సిల్ బృందం కళాశాలను సందర్శించిన తరువాత సీట్ల కేటాయింపు జరుగుతుందని తెలిపారు.

రేపు జిల్లాస్థాయి యోగా పోటీలు



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరు జిల్లా యోగా క్రీడా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదీ జిల్లాస్థాయి యోగా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ అసోసియేషన్ అధ్యక్షుడు నిర్మల నర్సింహారెడ్డి తెలిపారు. నగరంలోని శాంతినగర్‌లోని నిర్మల సౌదాలో శుక్రవారం ఈ పోటీలకు సంబంధించి కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారు అక్టోబర్ 14, 15 తేదీల్లో భీమవరంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధిస్తారని తెలిపారు. వివరాలకు 8885668752 ఫోన్‌నంబర్‌లో సంప్రదించాలని అసోసియేషన్ కార్యదర్శి ప్రసన్నకుమార్ తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ఎంవీ రమణారెడ్డి, ప్రసాద్‌బాబు, చిన్నారెడ్డి శ్రీనివాసులురెడ్డి, స్నేహాసురేష్, సింగారెడ్డి హేమంత్, రవీంద్ర పాల్గొన్నారు.

వచ్చే నెల 25 వరకు ఎన్ఎంఎంఎస్ ఫీజు గడువు పెంపు

నెల్లూరు(టౌన్): నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష ఫీజు గడువును వచ్చే నెల 25వ తేదీ వరకు పొడిగించినట్లు డీఈఓ గంగాభవాని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 3న పరీక్ష జరుగుతుందని తెలిపారు. పరీక్ష రుసుము జనరల్, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 చెల్లించాల్సి ఉందని తెలిపారు. వివరాలను www.bse.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చని తెలిపారు.

బద్దిపూడి జయరావుకు పురస్కారం



జయరావు

వలేటివారిపాలెం: ప్రముఖ కవి, రచయిత బద్దిపూడి జయరావు ఎం.చిన నాగయ్య స్మారక జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ మేరకు నాగయ్య మెమోరియల్ ట్రస్ట్ ప్రతినిధి రామ్ ప్రదీప్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023 సంవత్సరానికి గానూ జయరావు ఎంపికయ్యారని, వచ్చే నెలలో పురస్కారాన్ని అందజేస్తామని తెలిపారు. జయరావు మండలంలోని నూకవరం గ్రామం వాసి. ప్రైవేట్ తెలుగు లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. కవులు రామబ్రహ్మం, డాక్టర్ జయజీవితరాజు ఆయన అభినందనలు తెలిపారు.

వైఎస్సార్‌సీపీలోకి మేయర్ స్రవంతి



మేయర్ స్రవంతికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

- ఎంపీ వీపీఆర్ ఆధ్వర్యంలో తిరిగి పార్టీలో చేరిన మేయర్

నెల్లూరు(దర్గామిట్ట): రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నెల్లూరులోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం నెల్లూరు నగర మేయర్ పొట్లూరి స్రవంతి జయవర్ధన్ టీడీపీ నుంచి తిరిగి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ మేరకు మేయర్ దంపతులకు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎంపీ వేమిరెడ్డి మాట్లాడారు. మేయర్ స్రవంతి తన తప్పును తెలుసుకుని తిరిగి వైఎస్సార్‌సీపీలోకి రావడం మంచి పరిణామమన్నారు. మేయర్‌గా స్రవంతికి అవకాశం ఇచ్చింది సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని, ఆ విషయాన్ని తెలుసుకుని తిరిగి సొంత గూటికి వచ్చిన స్రవంతికి అభినందనలు తెలుపుతున్నామన్నారు. స్రవంతికి పార్టీలో ఎంతో భవిష్యత్ ఉందని, రాబోయే ఎన్నికల్లో పార్టీ నాయకులతో కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అనిల్ కుమార్‌యాదవ్ గెలుపునకు శక్తివంచన లేకుండా పనిచేయాలన్నారు. అటు రూరల్ ఎమ్మెల్యేగా పోటీ చేయనున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఎంపీగా పోటీ చేయనున్న తనకు, పార్టీ నాయకుల గెలుపునకు స్రవంతి పాటుపడాలని ఆకాంక్షించారు. అలాగే పార్టీలో ఉన్న అందరు నాయకులను సమన్వయం చేసుకుని నగరాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో చేసిన చిన్నపాటి పొరపాటును నగర మేయర్ పొట్లూరి స్రవంతి జయవర్ధన్ దంపతులు సరిదిద్దుకొని తిరిగి పార్టీలోకి రావడం సంతోషంగా ఉందన్నారు. వారిని మనస్ఫూర్తిగా వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్నామని అన్నారు. నెల్లూరు సిటీ, రూరల్ నియోజకవర్గాల్లోని కార్పొరేటర్లు, నాయకులతో కలిసి పనిచేయాలని సూచించారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయ్‌కుమార్‌రెడ్డి, మెట్టుకూరు ధనుంజయరెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, మహిళా అధ్యక్షురాలు మొయిళ్ల గౌరి, పలువురు కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ల నియామకం

నెల్లూరు(దర్గామిట్ట): వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జేసీఎస్ నెల్లూరు జిల్లా కోఆర్డినేటర్లను నియమించినట్లు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి శుక్రవారం ప్రకటన వెలువడింది. జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్లుగా యనమల భగవాన్, మర్లపాటి మహేష్, ఐ.నారాయణరెడ్డి నియమితులయ్యారు.

అవినీతికి తావివ్వకండి

- డ్వామా పీడీ వెంకట్రావ్

నెల్లూరు(పొగతోట): ఉపాధి హామీ పనుల నిర్వహణలో అవినీతికి తావులేకుండా సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీ వెంకట్రావ్ ఉపాధి సిబ్బందికి సూచించారు. శుక్రవారం నెల్లూరులోని డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో ఉపాధి హామీ పనులపై ఈసీలు, టీఏలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పీడీ మాట్లాడారు. 2023–24కి సంబంధించి ఉపాధి పనుల ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. పంచాయతీల వారీగా పనులను గుర్తించి ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. జాబ్‌కార్డ్స్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఉపాధి పనుల నిర్వహణలో లోపాలు కనిపించడం వల్ల సోషల్ ఆడిట్ సమయంలో రికవరీలు పడుతున్నాయన్నారు. అడిషనల్ పీడీ సుజాత మాట్లాడుతూ గ్రామాల వారీగా పనులను గుర్తించి పంచాయతీ తీర్మానం చేసి ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. డ్వామా క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ వేణుగోపాల్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పనుల నిర్వహణలో అనేక లోటుపాట్లు గుర్తిస్తున్నామన్నారు.

జర్నలిస్టులకు ఎంపీ వేమిరెడ్డి ఆర్థికసాయం



జర్నలిస్టు హజరత్‌కు ఆర్థికసాయం అందజేస్తున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఇద్దరు జర్నలిస్టులకు రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి రూ.4 లక్షల ఆర్థికసాయం అందజేశారు. శుక్రవారం నెల్లూరులోని వీపీఆర్ క్యాంపు కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. నెల్లూరులో సుదీర్ఘకాలంగా 'సాక్షి' పత్రికలో జర్నలిస్టుగా పనిచేస్తున్న హజరత్ తీవ్ర అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్న నేపథ్యంలో ఆయనకు రూ.2 లక్షలు ఆర్థికసాయం అందజేశారు. అలాగే 'సాక్షి'లో పనిచేస్తున్న మరో జర్నలిస్టు సుబ్రహ్మణ్యంకు మెదడు సంబంధిత శస్త్రచికిత్సకు రూ.2 లక్షలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, సాక్షి బ్యూరో ఇన్‌చార్జి సి.మస్తాన్‌రెడ్డి, బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాస్, ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు వల్లూరు వెంకటేశ్వర్లు, పాత్రికేయులు పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్ట్ సక్రమమే



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ న్యాయవాదులు

నెల్లూరు(లీగల్): మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్ట్ సక్రమమేనంటూ జిల్లా కోర్టు కాంపౌండ్ ఎదుట వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ న్యాయవాదులు శుక్రవారం ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జోనల్ ఇన్‌చార్జి ఆర్.రోజారెడ్డి మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో చంద్రబాబు పాత్ర ఉండడంతోనే ఆయనను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారని, ఇది న్యాయ ప్రక్రియలో భాగమని, తద్వారా చట్టం దృష్టిలో ప్రతి ఒక్కరూ సమానమని నిరూపితమైందని అన్నారు. తెలుగుదేశం పార్టీ రాజకీయ లబ్ధి పొందాలని భావిస్తూ చంద్రబాబు అరెస్ట్ రాజకీయ దురుద్దేశంతో జరిగినట్లుగా వక్రీకరిస్తోందని అన్నారు. కార్యక్రమంలో నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్‌రెడ్డి, ట్రెజరర్ రమేష్, జిల్లా లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి సుబ్బారెడ్డి, శ్రీధర్, విద్యాధర్‌రెడ్డి, వంశీకృష్ణారెడ్డి, రమాదేవి, ప్రశాంతి, మహేశ్వరి, సారిక, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

20 ఏళ్ల తర్వాత నక్కల కాలువ అభివృద్ధి పనులు



నక్కలకాలువ అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి
- పూడికతీత పనులు ప్రారంభం

ముత్తుకూరు: ముత్తుకూరు, వెంకటాచలం మండలాల రైతుల పొలాలను ముంపు నుంచి కాపాడే మేజర్ డ్రెయిన్ నక్కలకాలువను రూ.430.46 కోట్ల అంచనా వ్యయంతో అభివృద్ధి చేస్తున్నట్టు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని పొట్టెంపాడు వద్ద ఎఫ్‌డీఆర్ కింద నక్కల కాలువ మేజర్ డ్రెయిన్ అభివృద్ధి పనులను శుక్రవారం మంత్రి ప్రారంభించారు. పూడిపోయిన డ్రెయిన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1992లో అప్పటి ఎమ్మెల్యే సీవీ శేషారెడ్డి ఈ డ్రెయిన్ పూడిక తీయించారని, ఆ తర్వాత ఎవరూ పట్టించుకోలేదన్నారు. 2015లో వచ్చిన వరదలకు ఈ డ్రెయిన్ వరదనీటితో నిండిపోయి, పొలాలు, రొయ్యల గుంతలు మునిగిపోయాయని గుర్తుచేశారు. అప్పటి సీఎం చంద్రబాబు ఈ డ్రెయిన్‌ను పరిశీలించి వెళ్లారే తప్ప పూడిక తీయించలేదన్నారు. పలుమార్లు రైతులు కోరడం, గడప గడపకు కార్యక్రమంలో విజ్ఞప్తులు చేయడం ద్వారా సర్వేపల్లి నియోజకవర్గ పరిధిలో 13.8 కిలోమీటర్ల మేరకు డ్రెయిన్‌ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈ డ్రెయిన్‌పై శిథిలావస్థకు చేరిన ఆర్అండ్‌బీ బ్రిడ్జిని పునర్నిర్మించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.10 కోట్లు మంజూరు చేశారని తెలిపారు.

సోమిరెడ్డికి రైతులే బుద్ధి చెబుతారు

నక్కలకాలువను అభివృద్ధి చేస్తే మంచి పేరు వస్తుందన్న దుర్బుద్ధితో మాజీ మంత్రి సోమిరెడ్డి తమకు అవినీతి మరక అంటిస్తున్నారని మంత్రి కాకాణి మండిపడ్డారు. మంచి పనులు చేసేటప్పుడు సలహాలు, సూచనలు ఇవ్వడం మానేసి వాటికి అడ్డుపడి, బురద చల్లాలని ప్రయత్నిస్తే రైతులే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. టెండరు అయ్యే లోపు జరిగే పనులకు తన సొంత నిధులు వెచ్చిస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మెట్ట విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీపీ గండవరం సుగుణ, నాయకులు పల్లంరెడ్డి జనార్దన్‌రెడ్డి, దువ్వూరు చంద్రశేఖర్‌రెడ్డి, ప్రదీప్‌కుమార్‌రెడ్డి, మునుకూరు రవికుమార్‌రెడ్డి, ఈదూరు రామమోహన్‌రెడ్డి, కోదండరామరెడ్డి, మండల వెంకటశేషయ్య, రెండు మండలాల రైతులు, ఇంజినీర్లు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేనలు అధికారంలోకి రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్, చిత్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

- నెల్లూరు సిటీ ఎమ్మెల్యే డాక్టర్ అనిల్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): 'పవన్ కళ్యాణ్ నోరు తెరిస్తే ఆరునెలలే.. ఆరు నెలలే.. అంటున్నారు. ఎన్ని జన్మలెత్తినా తెలుగుదేశం, జనసేనలు అధికారంలోకి రావు.' అని నెల్లూరు సిటీ ఎమ్మెల్యే డాక్టర్ పి.అనిల్ కుమార్ అన్నారు. నెల్లూరు నగరంలోని 13వ డివిజన్ యలమదిన్నెలోని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అన్యాయంగా జైల్లో పెట్టినప్పుడు కొన్ని పత్రికలు ఇష్టారీతిగా వార్తలు రాశాయన్నారు. అప్పుడు లేవని గొంతులు చంద్రబాబునాయుడిని పూర్తి ఆధారాలతో అరెస్ట్ చేస్తే అన్యాయం జరిగిపోయిందని ఆర్తనాదాలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. పవన్ కళ్యాణ్ ఎప్పటి నుంచో బాబు దత్తపుత్రుడిగా ఉన్నాడన్నారు. ఇప్పుడు ఆయన తెలుగుదేశంతో కలిసొస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వారు పొత్తు ఎప్పుడో నిర్ణయించుకున్నారని రాష్ట్ర ప్రజలందరికీ తెలుసన్నారు. టీడీపీ అధినేత చేసిన అవినీతి ఒక్కొక్కటిగా అన్ని బయటకు వస్తాయన్నారు. త్వరలోనే అన్ని రాష్ట్ర ప్రజలకు తెలుస్తాయన్నారు. తెలుగుదేశం, జనసేన కలిసి రావాలనే కోరుకుంటున్నామన్నారు. ఆ రెండు పార్టీలను బంగాళాఖాతంలో కలిపేందుకు ప్రజలందరూ సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఎండీ ఖలీల్ అహ్మద్, ఊటుకూరు నాగార్జున, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



24వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయడం, పేదలకు సంక్షేమ పథకాలను పక్కాగా అందించడమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని నెల్లూరు ఎంపీ, ఆ పార్టీ రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. 24వ డివిజన్ కల్లూరుపల్లిలో రూ.60 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎంపీ మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సచివాలయాలు ఎంతగానో దోహదపడుతున్నాయన్నారు. ఈ డివిజన్‌లో వివిధ పనులకు మరో రూ.1.50 కోట్ల నిధులను త్వరలో మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఆయా ప్రాంతాల్లో ఇప్పటి వరకూ జరిగిన అభివృద్ధిని చూసి వైఎస్సార్‌సీపీని ప్రజలు ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు గౌరి, మర్రిపాడు జెడ్పీటీసీ మల్లు సుధాకర్‌రెడ్డి, రైల్వే బోర్డు సభ్యుడు స్వర్ణా వెంకయ్య, నాయకులు లేబూరు పరమేశ్వరరెడ్డి, ఏసునాయుడు, హరిబాబు యాదవ్, రామశివారెడ్డి, మల్లికార్జున్ యాదవ్, రూరల్ ఎంపీపీ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

19వ డివిజన్‌లో..

19వ డివిజన్‌లోని శ్రీహరి నగర్‌లో రోడ్ల నిర్మాణానికి ఎంపీ ఆదాల శుక్రవారం శంకుస్థాపన చేశారు. తాను సమన్వయకర్తగా నియమించబడిన తర్వాత ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేశామన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

కందుకూరు అభివృద్ధికి సహకారం



అమ్మవారి గుడిని పరిశీలిస్తున్న రాజ్యసభ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి


- అంకమ్మగుడి నిర్మాణం అద్భుతం
- రాజ్యసభసభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

కందుకూరు: 'నియోజకవర్గ అభివృద్ధిలో ముందుంటా. నా వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తా. బాధ్యతగా పనిచేసే ఎమ్మెల్యేగా మానుగుంట మహీధర్‌రెడ్డి నియోజకవర్గంలో ఉండడం అదృష్టం.' అని రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన కందుకూరు పర్యటనకు వచ్చారు. నూతనంగా నిర్మించిన అంకమ్మ దేవాలయానికి విచ్చేసి పూజలు చేశారు. నిర్మాణం ఆకట్టుకునే విధంగా ఉందని శిల్పిని ప్రత్యేకంగా అభినందించారు. తిరుమలలో జరిగే నిర్మాణాలకు ఇటువంటి నైపుణ్యమున్న శిల్పులను తీసుకెళ్తే బాగుంటుందని, ఈ మేరకు టీటీడీకి సిఫార్సు చేస్తానని చెప్పారు. కాగా ఆలయ నిర్మాణం జరిగిన స్థలానికి కొంత వాస్తు దోషం ఉందని, దానిని సరిదిద్దేందుకు సహకారం అందిస్తానని చెప్పారు. ఏ సమస్యనైనా మహీధర్‌రెడ్డి సంపూర్ణంగా అర్థం చేసుకుని పరిష్కారానికి కృషి చేస్తారన్నారు. అలాగే పోర్టు నిర్మాణానికి భూములు ఇప్పించడంలో ఎమ్మెల్యే కృషిని అభినందించారు. త్వరలో బెర్తు నిర్మాణం పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయడం గర్వకారణమన్నారు.

గుడికి రూ.50 లక్షల విరాళం

గ్రామదేవత అంకమ్మగుడి నిర్మాణాన్ని చూసి ముగ్ధుడైన ఎంపీ వేమిరెడ్డి ఆలయ భవిష్యత్ నిర్మాణాలకు తనవంతుగా రూ.50 లక్షల విరాళం ఇస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో నెల్లూరు నగర డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

నిమ్మధరలు



పెద్దవి	రూ. 75
సన్నవి	రూ. 40
పండ్లు	రూ. 12

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	133	బ్రాయిలర్ స్కిన్‌లెస్	256
లేయర్ (లైవ్)	113	లేయర్ చికెన్	192
బ్రాయిలర్ చికెన్	230		

500 మందికి ఉపాధి అవకాశాలు



కంపెనీ ప్రెసిడెంట్, అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

- ఆత్మకూరు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరు: వైఎస్సార్, నెల్లూరు జిల్లాల సరిహద్దులో బద్వేల్ సమీపంలోని సెంచూరియన్ ప్లై ఉడ్ కంపెనీలో ఆత్మకూరు నియోజకవర్గంలోని సుమారు 500 మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన ఆ కంపెనీని సందర్శించారు. దాని ప్రెసిడెంట్ హిమాన్షుషా, సిబ్బందితో సమావేశమై పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరలో ప్రారంభం కానున్న ఈ సంస్థ ద్వారా వందలాది మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. దీంతోపాటు కంపెనీకి కావాల్సిన రా మెటీరియల్, సుబాబుల్, జామాయిల్ రైతుల వద్ద కొనుగోలు చేసి తద్వారా వారిని ఆర్థికంగా ప్రోత్సహించనున్నట్లు ప్రెసిడెంట్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీంతో విక్రమ్‌రెడ్డి ఆత్మకూరు నియోజకవర్గంలోని యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలని కోరారు. వారికి కావాల్సిన నైపుణ్యాలపై ప్రత్యేక శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేస్తామన్నారు. ముఖ్యంగా సెంచురియన్ ఫ్యాక్టరీ వారికి కావాల్సిన ముడి సరుకును అందించేందుకు ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాల మెట్ట ప్రాంత రైతులను ప్రోత్సహించేలా సుబాబుల్, జామాయిల్, తదితర పంటలను విస్తారంగా సాగు చేసేలా అవగాహన సమావేశాలు నిర్వహించాలని ఎమ్మెల్యే కోరారు. కంపెనీ వారికి కావాల్సిన సహాయ సహకారాలు అందించేందుకు తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

లైంగికదాడి కేసులో నిందితుడికి జీవిత ఖైదు

- ప్రత్యేక పోక్సో కోర్టు తీర్పు

నెల్లూరు(లీగల్): బాలికపై లైంగికదాడికి పాల్పడ్డాడని నమోదైన కేసులో నేరం రుజువు కావడంతో సూళ్లూరుపేట మండలం మన్నారుపోలూరులోని గొల్లవీధికి చెందిన తంజిగారి రవికి జీవిత ఖైదుతోపాటు రూ.25 వేల జరిమానా విధిస్తూ ప్రత్యేక పోక్సో కోర్టు న్యాయమూర్తి సుమ శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. మన్నారుపోలూరుకు చెందిన రెండో తరగతి చదువుతున్న బాలిక 2019 సంవత్సరం మార్చి 18వ తేదీన ఉదయం ఏడు గంటల ప్రాంతంలో ఆడుకుంటోంది. ఈ క్రమంలో సమీపంలో నివాసం ఉంటున్న నిందితుడు రవి బాలికపై లైంగికదాడికి పాల్పడి అక్కడి నుంచి పరారయ్యాడు. జరిగిన విషయాన్ని తల్లికి బాలిక చెప్పింది. ఆమె ఫిర్యాదు మేరకు సూళ్లూరుపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం నిందితుడిపై కోర్టులో చార్జిషీట్‌ను దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో పైమేరకు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శైలజారెడ్డి కేసు వాదించారు.

డ్రైవర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నెల్లూరులోని ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ పరిధిలో డాక్టర్ వైఎస్సార్ సంచార పశు వైద్యశాలకు చెందిన వాహనానికి డ్రైవర్‌గా పనిచేసేందుకు ఈనెల 20వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మేనేజర్ శివశంకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 97041 65512 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

పవన్ కళ్యాణ్‌కు కావాల్సింది ప్యాకేజీ

- కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి



వైఎస్సార్‌సీపీ నాయకులతో ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: 'జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు కావాల్సింది చంద్రబాబు ఇచ్చే ప్యాకేజీ. దాని కోసం ఫ్యాన్స్‌ను తాకట్టు పెట్టాడు.' అని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. కావలిలో శుక్రవారం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడారు. ప్రజల సొమ్మును దోచుకున్న బాబు చట్టాలకు అతీతుడా అని ప్రశ్నించారు. ఆయన జైల్లో ఉండి రాజకీయ వ్యాపారం చేయడం మొదలు పెట్టాడని, అందులో భాగంగానే పవన్‌ను పిలిపించుకుని బేరం కుదుర్చుకున్నాడని చెప్పారు. వార్డు సభ్యుడిగా కూడా గెలవని పవన్ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చేయగలిగిందేమీ లేదన్నారు. చంద్రబాబు అడ్డంగా దొరికిపోతే.. అక్రమ కేసంటూ ఎల్లో మీడియాలో ఊదరగొడుతోందన్నారు. బాబు సీట్లో బాలకృష్ణ కూర్చున్నందుకు 48 గంటల్లోనే పవన్‌ను రంగంలోకి దింపారన్నారు. బాబు ఎన్టీఆర్ వారసులను నమ్మరన్నారు. టీడీపీ అధినేత ఏ తప్పు చేయకపోతే సీబీఐ, ఈడీ విచారణకు డిమాండ్ చేయాలన్నారు. తన తండ్రి మీద చెప్పులు వేయించిన చంద్రబాబునే బాలకృష్ణ ఏమీ చేయలేకపోయాడని, ఇంక సీఎం వైఎస్ జగన్‌ను ఏం చేయగలడని ప్రశ్నించారు. పవన్ రాజకీయాల్లోకొచ్చి చంద్రబాబుకు అవసరమైనప్పుడు మద్దతు ఇవ్వడం మినహా యువతకు మేలు చేసే లక్ష్యం ఆయనలో కనిపించడం లేదన్నారు.

న్యాక్ ఏ గ్రేడ్ రావడం సంతోషకరం

- వీసీ సుందరవల్లి



వెంకటాచలం: మండలంలోని కాకుటూరులో ఉన్న విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ)కు న్యాక్ నుంచి ఏ గ్రేడ్ రావడం చాలా సంతోషకరమని వీసీ జీఎం సుందరవల్లి అన్నారు. వర్సిటీలో శుక్రవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏ గ్రేడ్ వల్ల రూ.20 కోట్ల నిధులు వీఎస్‌యూ అభివృద్ధికి సమకూరనున్నాయని తెలియజేశారు. అంతేకాకుండా వర్సిటీకి ప్రత్యేక గుర్తింపు లభించి విద్యార్థులకు ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయన్నారు. విదేశీ విద్య, చదువు పూర్తి చేసిన వారికి ప్లేస్‌మెంట్ అవకాశాలు మెరుగుపడనున్నట్లు పేర్కొన్నారు. భవిష్యత్‌లో మరింత సమష్టి కృషితో గ్రేడ్ ఏ ప్లస్ సాధిస్తామన్నారు. సమావేశంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డి, ప్రిన్సిపల్ విజయానంద్‌కుమార్ బాబు, వీఎస్‌యూ ఐక్యూఏసీ డైరెక్టర్ అందె ప్రసాద్, న్యాక్ డైరెక్టర్ సుజా ఎస్.నాయర్, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

మార్కెట్లోకి టాటా న్యూ నెక్సాన్ కారు



కారు వద్ద ఆర్టీఓ చందన తదితరులు

నెల్లూరు(టౌన్): బుజబుజనెల్లూరులోని వరలక్ష్మి ఆటో మొబైల్స్ షోరూంలో శుక్రవారం రవాణా శాఖ ఆర్టీఓ చందన చేతుల మీదుగా టాటా న్యూ నెక్సాన్ కారును మార్కెట్లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టాటా యాజమాన్యం వినియోగదారుల అభిరుచులకు తగ్గట్లు కొత్త వాహనాలను మార్కెట్లోకి విడుదల చేయడం అభినందనీయమన్నారు. షోరూం మేనేజింగ్ డైరెక్టర్స్ కొండా రాంప్రసాద్, కొండా వివేక్‌లు మాట్లాడుతూ ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు, స్మార్ట్ కంట్రోల్ సిస్టం, వైర్‌లెస్ చార్జింగ్, 360 డిగ్రీల కెమెరా తదితరాలు కారు ప్రత్యేకతలని చెప్పారు. కార్యక్రమంలో ఎంవీఐ మురళీమోహన్, భాస్కర్, ప్రదీప్, సీనియర్ మేనేజర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

హ్యాండ్లూమ్, హ్యాండీ క్రాఫ్ట్స్ ఎక్స్‌పో ప్రారంభం



మాట్లాడుతున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): చేనేత, హస్త కళా ఉత్పత్తులతో ఆలిండియా హ్యాండ్లూమ్, హ్యాండీ క్రాఫ్ట్స్‌షాపింగ్ ఎక్స్‌పో - 2023 ప్రదర్శన, అమ్మకాలను ఏర్పాటు చేసినట్లు ఎక్స్‌పో నిర్వాహకులు దీపక్, శ్రీవిద్య, కైజర్‌లు తెలిపారు. నెల్లూరులోని కస్తూరి దేవి గార్డెన్స్ ఎదురుగా ఉన్న మైదానంలో శుక్రవారం ఎక్స్‌పోను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని రాష్ట్రాలకు చెందిన చేనేత, హస్తకళా ఉత్పత్తులకు ఆదరణ కల్పించాలన్న సంకల్పంతో ఉత్పత్తి ధరలకే వినియోగదారులకు అందించాలని నిర్ణయించామన్నారు. అందులో భాగంగా కలంకారి, బెంగాలి కాటన్, చాందిని శారీస్, డ్రెస్ మెటీరియల్స్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ బెడ్‌షీట్స్, ఖాదీ షర్ట్స్, డోర్ కర్టెన్స్, కాటన్, ఖాదీ టాప్స్, వన్ గ్రామ్ గోల్డ్ ఆభరణాలు తదితర 90కి పైగా స్టాల్స్ పెట్టామన్నారు. రోజూ ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రదర్శన, అమ్మకాలు జరుగుతాయన్నారు.



ఒత్తిడిని వదిలేయండి ఇలా...

ఉదయం లేచినప్పటి నుంచి ఉరుకులు పరుగులు మొదలు. చేయాల్సిన పనుల చిట్టా చాంతాడంత. దీంతో హడావుడి, ఆందోళన. ఫలితం ఒత్తిడి. అందుకనే ఈ రోజుల్లో ఎక్కువ శాతం మంది ప్రజలు ఒత్తిడికి గురవుతున్నారు. ఆందోళనతో చిత్తవుతున్నారు. వీటి వల్ల వచ్చే శారీరక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. మరి ఈ ఒత్తిడిని తగ్గించుకుంటే చాలా అనారోగ్య సమస్యల నుంచి బయట పడొచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. అందుకు ఇంట్లో మనంతట మనం పాటించగల చిన్న చిట్కాలను చెబుతున్నారు. అవేంటో చూద్దామా..?

గోరు వెచ్చని లేదా చల్లని నీటితో స్నానం చేయడం చాలా మంచిది. శరీరంలో ఎక్కడైనా నొప్పులుగా అనిపిస్తే చిన్నగా మసాజ్ చేసుకోవడం, కండరాలన్నీ సాగేలా ఒళ్లు విరుచుకోవడం లాంటి పనుల వల్ల ఒత్తిడి తగ్గుతుంది. బాత్ రూమ్‌లో కూనిరాగాలు తీయడం లేదా ఏదైనా లైట్ మ్యూజిక్‌ని పెట్టుకుని, గోరువెచ్చని నీటితో శరీరం, మనస్సు తేలిక పడేంతవరకు టబ్ బాత్ చేయాలి. అందుకు మంచి సువాసన ఉన్నసహజమైన సబ్బును ఉపయోగించాలి. ఇలా చేయడం వల్ల ఒత్తిడి నుంచి కాస్త ఉపశమనం లభిస్తుంది.

నృత్యం...

నృత్యం చేయడం అనేది ఒత్తిడి నివారిణిలా పని చేస్తుందని కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి. మంచి సంగీతాన్ని పెట్టుకుని దానికి తగినట్లుగా డ్యాన్స్ చేయవచ్చు. ఎవరైనా ఉన్నప్పుడు చేయడం మొహమాటం అయితే ఎవరూ లేనప్పుడు ఆ పని చేయండి. దీనివల్ల మనసుకు ఆనందం కలుగుతుంది. ఒత్తిడి హార్మోన్ల స్థాయి తగ్గుతుంది.

ఇష్టమైన వారితో ప్రేమగా...

ఎక్కువ ఒత్తిడిలో ఉన్నప్పుడు ఇష్టమైన వారితో ప్రేమగా... సంతోషంగా గడిపేందుకు ప్రయత్నించండి. అందువల్ల శరీరంలో డోపమైన్ లాంటి హ్యాపీ హార్మోన్‌లు విడుదలవుతాయి. దీంతో మీరు ఒత్తిడి నుంచి బయటపడే అవకాశం ఉంటుంది.

బబుల్ ర్యాప్‌లను పగలగొట్టడం...

బబుల్ ర్యాప్ కవర్లను చూడగానే అంతా వాటిని పగలగొట్టాలని ఉవ్విళ్లూరతారు. అందుకు కారణాలు లేకపోలేదు. అలా వాటిని పేల్చడం వల్ల మనలో ఓ రకమైన ఆనందం కలుగుతుంది. ఒత్తిడి దూరమవుతుంది. అందువల్లనే మనం వాటిని పేల్చేందుకు ఇష్ట పడుతుంటాం.

మంచి పుస్తకాలు చదవడం...

మంచి పుస్తకాలు, పేపర్లు చదవడం ద్వారా కూడా ఒత్తిడి నుంచి బయటపడవచ్చు. ఒత్తిడిగా అనిపించినప్పుడు మీకు నచ్చిన పుస్తకం తీసి చదవండి. వెంటనే తగ్గుముఖం పడుతుంది ఆ ఒత్తిడి. అలాగే రోజూ దినపత్రికలను చదవడం కూడా ఒత్తిడి నివారణలో ఒక భాగం. దినపత్రికలు చదవడమనగానే నేరవార్తలు, హత్యావార్తలు కాదు. మనసుకు కాస్తంత ఆహ్లాదం కలిగించే వార్తలు చదవడం మేలు.

అలయ సందర్శనం...

మీ మతాన్ని అనుసరించి మీరు ప్రార్థనామందిరాలను సందర్శించడం మంచిది. రోజూ కాసేపు పూజామందిరంలో గడపడం వల్ల మనసుకు ప్రశాంతత చేకూరుతుంది. అలాగని దేనినీ అతిగా చేయరాదు. గంటలు గంటలు పూజలు చేస్తూ గడపడం కూడా మంచిది కాదు. క్రమం తప్పకుండా ఆలయానికి లేదా మసీద్‌కు లేదా చర్చికి వెళ్లడం వల్ల ఒత్తిడి దూరం అవుతుంది.

మీరు ఒత్తిడిలో ఉన్నారు అనుకున్నప్పుడువీటిలో మీకు వీలైనవాటిని పాటించి చూడండి.

అన్నింటికన్నా ముఖ్యం ఒత్తిడి వచ్చాక బాధ పడేకంటే ఒత్తిడికి గురికాకుండా చూసుకోవడం చాలా ఉత్తమం. అదేవిధంగా ఒత్తిడి ఎందువల్ల వస్తుందో తెలుసుకుంటే నివారించుకోవడం సులభం కాబట్టి. ముందుగా మీ పనులను ప్రశాంతగా పూర్తి చేయడం ఆరంభించండి.



ధ్యానం...

ఒత్తిడి నుంచి బయట పడటానికి ధ్యానం అద్భుతమైన మార్గం అని చాలా అధ్యయనాల్లో తేలింది. శ్వాస మీద ధ్యాస పెట్టి కేవలం రెండు నిమిషాలు కళ్లు మూసుకున్నా సరే అది మీ శరీరంలో స్ట్రెస్ హార్మోన్ సార్టిసాల్ స్థాయుల్ని తగ్గిస్తుంది.

ఆహారానికి సుగంధం ఆరోగ్యానికి అందలం



ఆహారం సులభంగా జీర్ణమవడానికి ఆహారంలో కొన్ని సుగంధ ద్రవ్యాలను చేర్చుకుంటే మేలు. అవేంటో, ఎలా పనిచేస్తాయో తెలుసుకుందాం...

జీర్ణశక్తి బాగుంటే ఆరోగ్యం బాగున్నట్లే. మనం తీసుకునే ఆహారం మీదనే అది జీర్ణమవడం ఆధార పడి ఉంటుంది. మన వంటిళ్లలో సహజంగానే జీర్ణశక్తిని పెంచే సుగంధ ద్రవ్యాలు బోలెడుంటాయి. అలాంటి వాటిలో తేలికగా అందుబాటులో ఉండే పదార్థాలే ఎక్కువ. వాటిని వాడటం ద్వారా జీర్ణశక్తి ఎలా మెరుగవుతుందో చూద్దాం...




అల్లం...

దీర్ఘకాలిక అజీర్తి సమస్యలు ఉన్న వాళ్లకి అల్లం మంచి మందు. ఇది కడుపు నొప్పి రాకుండా చేస్తుంది. అల్లం టీ తాగడం, వండుకునే ఆహార పదార్థాల్లో కొంచెం అల్లాన్ని చేర్చడం ద్వారా ఆహారం తేలికగా జీర్ణం అవుతుంది. కడుపు ఖాళీ అవడానికీ ఇది సహకరిస్తుంది.



ధనియాలు...

కడుపు ఉబ్బరంగా, వికారంగా ఉన్నప్పుడు కాసిని ధనియాలు నీటిలో వేసి మరిగించి తాగడం వల్ల ఉపశమనం కలుగుతుంది. ధనియాల్లో ఉండే కొన్ని లక్షణాల వల్ల గ్యాస్ సమస్యలు దూరం అవుతాయి.



యాలకులు...

కడుపులో మంట, నొప్పి, వికారం లాంటి వాటికి యాలకులు మంచి మందులా పని చేస్తాయి. దీంట్లో మాంగనీసు ఎక్కువగా ఉంటుంది. ఇది తిన్న ఆహారం అరిగి శక్తినిచ్చేలా చేస్తుంది. మధుమేహం నుంచి కాపాడుతుంది.





మెంతులు...

నానబెట్టిన మెంతుల్ని ఖాళీ కడుపుతో తినడం వల్ల జీర్ణ సంబంధిత సమస్యలు తగ్గుతాయి. అజీర్తి, మలబద్ధకం లాంటి వాటికి పరిష్కారం దొరుకుతుంది. పేగుల ఆరోగ్యం బాగుంటుంది.

సోంపు...

ఆహారం తేలిగ్గా జీర్ణం కావడానికి సోంపు చాలా మంచిది. ఇంట్లో కూడా తిన్న వెంటనే కొన్ని సోంపు గింజలు నమిలితే దీనిలో ఉండే పొటాషియం, జింక్, మాంగనీసు, ఐరన్, కాపర్ లాంటి ఖనిజాలు జీర్ణ వ్యవస్థ సక్రమంగా పనిజేయడంలో సహకరిస్తాయి.



జీలకర్ర...

జీలకర్రలో మెగ్నీషియం, కాల్షియం, ఐరన్, పాస్ఫరస్ సమృద్ధిగా ఉంటాయి. ఇంకా విటమిన్ ఎ, సి, కె, ఇ, బీ 6 కూడా ఉంటాయి. రోజూ టీ స్పూను జీలకర్ర తీసుకోవడం వల్ల ఈ పోషకాలన్నీ శరీరానికి అందుతాయి. పేగుల్లో పేరుకుపోయిన మలినాలను తొలగించడంలో ఇది సహకరిస్తుంది. దీన్ని భోజనానికి ముందు తీసుకుంటే డైజెస్టివ్ ఎంజైమ్స్‌ని ప్రేరేపిస్తుంది. జీర్ణక్రియలో సహకరిస్తుంది.

అందువల్ల ఈ సుగంధ ద్రవ్యాలను తప్పకుండా తీసుకోవాలి.

హెల్త్ టిప్స్



- ఉసిరి పచ్చడి తీసుకోవడం, తేనెలో నాన పెట్టిన ఉసిరిని నిత్యం పద్ధతి ప్రకారం సేవించడం ద్వారా దృష్టిలోపం తగ్గుతుంది. ఉసిరి పొడిని నిత్యం పరకడుపున తేనెతో కలిపి సేవించడం వల్ల వత్తిడి, అలసట తగ్గుతుంది.



- ఎండు ద్రాక్షలు లేదా కిస్‌మిస్‌లు వాడడం మంచిది. వీటికి చలువ చేసే గుణం వుంది. గ్లాసుడు నీళ్లలో ఎండు ద్రాక్షలు వేసి, నాన పెట్టి, ఆ నీటిని తీసుకుంటే వేడి చేయకుండా ఉంటుంది. ముఖ్యంగా పిల్లలకు చాలా మంచిది.



- గోధుమలు, బియ్యం, పెసలు, రాగులు, సోయాగింజ లు, జొన్నలు అరకిలో వంతున కలిపి, 50 గ్రాముల నువ్వులు, 20 గ్రాముల జీలకర్ర జోడించి, దోరగా విడివిడిగా వేయించాలి. ఆపై మరపట్టించి రొట్టెలు చేసుకుంటే ఆరోగ్యానికి చాలా మంచిది. ఈ పిండితో జావ కూడా చేసుకోవచ్చు.



- నెలసరి నొప్పితో బాధపడేవారు పుదీనా ఆకులను నీళ్లలో వేసి మరిగించి, వడ కట్టి, ఆ నీటిని సేవించడం వల్ల మంచి ఫలితం వుంటుంది. పుదీనా ఆకులు, ఉప్పు కలిపి నీటిలో మరిగించి, ఆ ఆవిరి పడితే గొంతు మృదువుగా మారుతుంది.

సడెన్‌గా చెమటలా..?

చెమటలు పట్టడం అనేది చాలా సాధారణ విషయం.. ఎందుకంటే శరీర శ్రమ అతిగా చేయడం వల్ల అందరిలో చెమట పడుతూ ఉంటుంది. ముఖ్యంగా వేసవిలో మరింత సహజం. అయితే కొందరిలో చెమట విచ్చలవిడిగా పడుతూ ఉంటుంది. దీంతోపాటు కొందరిలో అకస్మాత్తుగా చెమటలు పోస్తాయి. ఇలాంటి లక్షణాలు ఉన్నవారు చాలామంది దీనిని సాధారణ సమస్యగా భావించి తేలిగ్గా తీసుకుంటున్నారు. దీని వల్ల భవిష్యత్‌లో ఆరోగ్య సమస్యలని కొని తెచ్చుకున్నట్లేనని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. ఇలా మీకు జరుగుతుంటే మాత్రం మీ ఒంటి మీద మీరు కాస్తంత శ్రద్ధ తీసుకోవాల్సిందే మరి!



అకస్మాత్తుగా చెమటలు పట్టడం అనేకరకాల అనారోగ్య సమస్యలకు ముందస్తు సూచనలని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. దీనిని గుండెజబ్బుల లక్షణాలలో ఒకటిగా వైద్యులు భావిస్తారు. తీవ్ర అనారోగ్య సమస్యలు వచ్చే ముందు తరచు ఆకస్మాత్తుగా చెమటలు పడతాయని నిపుణులు చెబుతున్నారు. మీలో ఇలాంటి లక్షణాలు ఉంటే వైద్యులను సంప్రదించడం, వారి సలహా మేరకు హెల్త్‌చెకప్ చేయించుకోవడం మంచిదని అనుభవజ్ఞుల సలహా.

అధిక చెమట ఈ వ్యాధుల లక్షణాలలో ఒకటి...

అకస్మాత్తుగా చెమటలు పట్టడం గుండెపోటు మొదటి లక్షణమని ఆరోగ్య నిపుణులు తెలుపుతున్నారు. మహిళలకు రాత్రిపూట ఎక్కువగా చెమట పడడం వల్ల భవిష్యత్‌లో రానున్న తీవ్రసమస్యలకు సంకేతాలు. తీవ్ర దీర్ఘకాలిక వ్యాధుల కారణంగా కూడా ఎక్కువగా చెమట పడుతుందని వైద్యనిపుణులు చెబుతున్నారు. అంతేకాకుండా కొంతమందిలో మధుమేహం పెరగడం కారణంగా కూడా ఇలాంటి సమస్యలు వస్తాయి.

- అకస్మాత్తుగా వచ్చే చెమటలు రాకుండా ఉండాలంటే... ఆహారంలో ఉప్పు వాడకాన్ని తగ్గించడం
- మద్యపానం అలవాటుంటే వెంటనే మానేయడం
- ఆకు కూరలు, పీచు పదార్థాలు అధికంగా ఉండే ఆహారాలు తీసుకోవడం
- గ్రీన్ టీ తీసుకోవడం
- రోజుకు కనీసం మూడు లీటర్ల నీటిని తాగడం
- డీప్ ఫ్రైలు, ఇతర నూనె పదార్థాలను తగ్గించడం
- ప్రతి రోజూ తేలికపాటి వ్యాయామాలు చేయడం
- పద్ధతి ప్రకారం డైట్ తీసుకోవడం అవసరం.

సినిమా

మీ ఆనందమే నాకు సంతృప్తి



- విజయ్ దేవరకొండ

"నేను చదువుకునే రోజుల్లో ఫ్రెండ్స్ అంతా విహార యాత్రకు వెళ్తే నేను ఇంట్లో డబ్బులు అడిగి ఇబ్బందిపెట్టడం ఇష్టం లేక అలాగే ఉండిపోయేవాడిని. ఆ విహార యాత్రలో నా స్నేహితులు ఎలా ఎంజాయ్ చేస్తున్నారో అని ఆలోచిస్తూ ఉండేవాడిని. తమ్ముడి (ఆనంద్ దేవరకొండ) ఇంజినీరింగ్ ఫీజు కోసం ఇబ్బంది పడుతున్నప్పుడు ఎవరైనా కొంత సహాయం చేస్తే బాగుండును అనిపించేది. కానీ ఎవర్నీ అడగడానికి ఇష్టం ఉండేది కాదు. అవన్నీ దాటుకుని ఈ స్థాయికి చేరుకున్నాను. ఇవాళ మీకు (అభిమానులు) హెల్ప్ చేయగలుగుతున్నాను అంటే అది నా వ్యక్తిగత ఆకాంక్ష. నేను అందించే ఈ లక్ష రూపాయలతో మీకు ఒత్తిడి తగ్గి ఆనందం కలిగితే అది నాకు సంతృప్తిగా ఉంటుంది'' అన్నారు విజయ్ దేవరకొండ. శివ నిర్వాణ దర్శకత్వంలో విజయ్ దేవరకొండ, సమంత జంటగా నటించిన చిత్రం 'ఖుషి'. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్‌లు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 1న విడుదలైంది. 'ఖుషి' సినిమా హ్యాపీనెస్‌ను షేర్ చేసేందుకు ఎంపిక చేసిన 100 లక్కీ ఫ్యామిలీస్‌కు రూ. లక్ష చొప్పున చెక్స్ అందించారు విజయ్ దేవరకొండ. హైదరాబాద్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో విజయ్ దేవరకొండ మాట్లాడుతూ– ''ఈ ప్రోగ్రామ్‌ను అనౌన్స్ చేసినప్పటి నుంచి మాకు ఇప్పటివరకూ 50 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. అయితే ఈ ఏడాది వంద మందికి మాత్రమే సహాయం చేయగలుగుతున్నాం. ప్రతి ఏడాది కొంతమందికి సహాయం చేస్తూనే ఉంటాను. నేను స్ట్రాంగ్‌గా ఉన్నంతవరకూ, సినిమాలు చేస్తున్నంతవరకూ నేను సహాయం చేస్తూనే ఉంటాను. మీరు నాపై చూపిస్తున్న ప్రేమకు థ్యాంక్స్'' అన్నారు. ''కేవలం తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక, సౌత్ స్టేట్స్ నుంచి సెలెక్ట్ చేశారు. సౌత్‌లో అన్ని ప్లేసెస్ నుంచి మా సినిమాకు మంచి స్పందన లభించింది'' అన్నారు శివ నిర్వాణ. ''వంద మందికి సహాయం చేయాలనే ప్రయత్నం మా మూవీతో విజయ్ మొదలుపెట్టినందుకు సంతోషంగా ఉంది'' అన్నారు నవీన్, రవిశంకర్.



- మృణాల్ ఠాకూర్

కోలీవుడ్ కబురు?

దివంగత నటి శ్రీదేవి చిన్న కుమార్తె ఖుషీ కపూర్‌కు కోలీవుడ్ నుంచి కబురు వెళ్లిందట. తమిళ నటుడు అథర్వ హీరోగా ఆకాష్ అనే కొత్త దర్శకుడు ఓ తమిళ చిత్రాన్ని తెరకెక్కించనున్నారనే టాక్ కోలీవుడ్‌లో వినిపిస్తోంది. ఈ సినిమాలోని హీరోయిన్ పాత్రకు ఖుషీ కపూర్‌ను సంప్రదించిందట చిత్ర యూనిట్. ఖుషీకి ఈ కథ నచ్చిందని, ఆమె దాదాపు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారన్నది కోలీవుడ్ సినీ సర్కిల్స్‌లో వినిపిస్తున్న మాట. ఒకవేళ ఇదే నిజమైతే.. ఖుషీ కపూర్ నటించే తొలి తమిళ సినిమా ఇదే అవుతుంది. ఈ సంగతి ఇలా ఉంచితే.. 'పయ్యా ('ఆవారా')' సినిమాకు సీక్వెల్‌గా 'పయ్యా 2' రానుందని, ఇందులో ఆర్య హీరోగా నటిస్తారని, ఖుషీ కపూర్ హీరోయిన్‌గా ఎంపికయ్యారనే టాక్ గతంలో కోలీవుడ్‌లో వినిపించింది. అయితే 'పయ్యా 2' సీక్వెల్‌లో ఖుషీ కపూర్ నటిస్తుందనే వార్తల్లో వాస్తవం లేదని ఆమె తండ్రి, నిర్మాత బోనీ కపూర్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించిన సంగతి గుర్తుండే ఉంటుంది. ఇక హిందీలో 'ఆర్చీస్' అనే వెబ్ ఫిల్మ్‌లో ఖుషీ కపూర్ నటిస్తున్నారు. ఈ చిత్రం నవంబర్ నుంచి స్ట్రీమింగ్ కానుందని సమాచారం.



- ఖుషీ కపూర్

సప్త సాగరాలు

రక్షిత్ శెట్టి హీరోగా నటించి, నిర్మించిన కన్నడ చిత్రం 'సప్త సాగర దాచే ఎల్లో'. హేమంత్ ఎం. రావు దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటించారు. ఈ నెల 1న కన్నడలో విడుదలైన ఈ చిత్రం హిట్‌గా నిలిచింది. ఈ సినిమాని పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్, రక్షిత్ శెట్టి కలిసి 'సప్త సాగరాలు దాటి' అనే పేరుతో ఈ నెల 22న తెలుగులో విడుదల చేయనున్నారు. ''క్లాసిక్ లవ్ స్టోరీగా రూపొందిన చిత్రమిది. కన్నడలో సూపర్ హిట్ టాక్ తెచ్చుకున్న ఈ చిత్రం తెలుగులోనూ సక్సెస్ అవుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు టీజీ విశ్వప్రసాద్. ఈ చిత్రానికి సహనిర్మాత: వివేక్ కూచిభొట్ల.



- రక్షిత్, రుక్మిణి

ఆ రోజు కీడా కోలా



- బ్రహ్మానందం

'పెళ్ళిచూపులు', 'ఈ నగరానికి ఏమైంది?' చిత్రాల ఫేమ్ దర్శకుడు తరుణ్ భాస్కర్ నటించి, తెరకెక్కించిన తాజా చిత్రం 'కీడా కోలా'. క్రైమ్ కామెడీ జానర్‌లో రూపొందిన ఈ యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ మూవీలో బ్రహ్మానందం, రఘురామ్, రవీంద్ర విజయ్ లీడ్ రోల్స్ చేశారు. కె.వివేక్ సుధాంషు, సాయికృష్ణ గద్వాల్, శ్రీనివాస్ కౌశిక్, శ్రీపాద్ నందిరాజ్, ఉపేంద్ర వర్మ ఈ సినిమాను నిర్మించారు. కాగా ఈ సినిమా నటుడు–నిర్మాత రానా సమర్పణలో నవంబరు 3న విడుదల కానున్నట్లుగా చిత్ర యూనిట్ శుక్రవారం అధికారికంగా వెల్లడించింది. ఈ సినిమాకు సంగీతం: వివేక్ సాగర్.

భయం.. అత్యాశ.. కుట్ర



- వంశీ, ఆనంద్ దేవరకొండ, ఉదయ్, అనురాగ్

ఆనంద్ దేవరకొండ హీరోగా ఉదయ్ శెట్టి దర్శకత్వం వహించిన చిత్రం 'గం..గం.. గణేశా'. కేదార్ సెలగంశెట్టి, వంశీ కారుమంచి నిర్మించిన ఈ చిత్రం టీజర్‌ని రిలీజ్ చేశారు. ఈ వేడుకలో ఆనంద్ దేవరకొండ మాట్లాడుతూ– ''భయం, అత్యాశ, కుట్ర అంశాల చుట్టూ ఈ సినిమా కథనం సాగుతుంది. 'బేబీ' తో ఆడియన్స్ ఎంత ఎమోషనల్ అయ్యారో, 'గం..గం..గణేశా' చిత్రంతో అంత ఎంటర్‌టైన్ అవుతారు. ఉదయ్ కథ, విజన్‌ను నమ్మి ఈ సినిమా చేశాను'' అన్నారు. ''ఈ సినిమా విజయంపై మాకు పూర్తి నమ్మకం ఉంది'' అన్నారు వంశీ కారుమంచి. 'ప్రేక్షకులకు నచ్చే చిత్రం ఇది'' అన్నారు ఈ చిత్ర సహనిర్మాత అనురాగ్ పర్వతనేని.

మిస్టర్ ఇడియట్ వస్తున్నాడు

హీరో రవితేజ తమ్ముడు రఘు కుమారుడు మాధవ్ హీరోగా నటిస్తున్న చిత్రం 'మిస్టర్ ఇడియట్'. సిమ్రాన్ శర్మ హీరోయిన్. గౌరీ రోణంకి దర్శకత్వంలో జేజేఆర్ రవిచంద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. శుక్రవారం మాధవ్ బర్త్ డే. ఈ సందర్భంగా 'మిస్టర్ ఇడియట్' లోని మాధవ్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను దర్శక–నిర్మాత కె. రాఘవేంద్ర రావు విడుదల చేశారు. ''మిస్టర్ ఇడియట్' ని ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు గౌరీ రోణంకి. ''నవంబరులో ఈ సినిమాను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం'' అన్నారు నిర్మాత జేజేఆర్ రవిచంద్.



- మాధవ్, సిమ్రాన్ శర్మ

ప్రేమకథ విన్నారా?

కెరీర్‌లో హీరోయిన్‌గా మంచి ఫామ్‌లో ఉన్నారు మృణాళ్ ఠాకూర్. నార్త్ అండ్ సౌత్ అనే తేడాలను పక్కన పెడితే ఈ బ్యూటీ హీరోయిన్‌గా నటించిన ఐదు సినిమాలు రిలీజ్‌కు రెడీ అవుతున్నాయంటే ఆమె ఏ స్పీడ్‌తో దూసుకెళ్తున్నారో ఊహించవచ్చు. ఇదే స్పీడ్‌ను కొనసాగించాలనుకుంటూ బాలీవుడ్ కొత్త సినిమాకు సై అన్నారట మృణాళ్. శ్రీదేవి టైటిల్ రోల్ చేసిన హిందీ హిట్ ఫిల్మ్ 'మామ్' తీసిన దర్శకుడు రవి ఉదయార్ ఇటీవల ఓ లవ్‌స్టోరీ స్క్రిప్ట్‌ను రెడీ చేసుకున్నారట. ఆయన ఈ కథను మృణాళ్‌కు వినిపించగా, ఆమె గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని బాలీవుడ్ సమాచారం. సిద్ధార్థ్ చతుర్వేది హీరోగా నటించనున్న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ వచ్చే ఏడాది ప్రారంభం కానుందని బీ టౌన్ టాక్.

అందాలు చదివే కళ్లకైనా...



- పంఖురి, నవదీప్

నవదీప్ హీరోగా నటించిన తాజా చిత్రం 'లవ్ మౌళి'. అవనీంద్ర దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో పంఖురి గిద్వానీ, మిర్చి హేమంత్ నటించారు. ప్రశాంత్ రెడ్డి తాటికొండ నిర్మాత. గోవింద్ వసంత సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'అందాలు చదివే కళ్లకైనా.. కందాలు తిరిగే కాళ్లకైనా.. వందేళ్లు కదిలే గుండెకైనా..' అంటూ సాగే పాటని రిలీజ్ చేశారు. అనంత శ్రీరామ్ రాసిన ఈ పాటను అనిల్ కష్ణన్ పాడారు. ''లవ్ మౌళి' షూటింగ్ మొత్తం మేఘాలయలోని చిరపుంజీలో చిత్రీకరించాం'' అని యూనిట్ పేర్కొంది.